కడా కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తోపాటు విద్యాధికారులతో సమీక్షిస్తున్న తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

- తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి
- కడా కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తోపాటు విద్యాధికారులతో సమీక్ష

కొడంగల్, అక్టోబర్ 22 : విద్యా వ్యవస్థలో సమూల మార్పులు, పూర్వ ప్రాథమిక ఉన్నత విద్యపై రాష్ట్ర తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు విశ్వేశ్వర్‌రావు, సీహెచ్ వెంకటేశ్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, నియోజకవర్గ పరిధిలోని ఎంఈవోలు తదితర అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా వ్యవస్థలో సమగ్ర పరిశీలనతో పాటు తీసుకోవాల్సిన మార్పులు వంటి వాటిపై చర్చించారు. అనంతరం పట్టణంలోని జీసీసీఎస్ పాఠశాలతో పాటు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల., బాలికల, బాలుర వసతి గృహాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించి ఏర్పాట్లపై ఆరా తీశారు. పాఠశాలల్లోని ఉపాధ్యాయుల నియామకాలు, విద్యార్థుల సౌకర్యాలు వంటి వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీవోలు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- సంబంధిత అధికారులతో సన్నాహక, శిక్షణా కార్యక్రమం

సన్నాహక, శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, అక్టోబర్ 22 : ఖరీఫ్ 2024-25 వరి ధాన్యం సేకరణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ హాలులో ధాన్యం కొనుగోళ్లపై సన్నాహక, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మద్దతు ధర క్వింటాల్ గ్రేడ్ ఎ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300, సన్న రకానికి అదనంగా రూ.500 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలవారు సన్న రకం ధాన్యం గుర్తించడంలో ఏఈవో, ఏవోల సహకారం తీసుకోవాలని తెలిపారు. సన్న ధాన్యం, దొడ్డు ధాన్యాల కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కొనుగోలు కేంద్రంలో సన్న ధాన్యం నింపు గోనె సంచులను ఎర్ర దారంతో కుట్టాలని, ఎస్ అనే అక్షరం ముద్రించాలని.. దొడ్డు ధాన్యం నింపు గోనె సంచులను ఆకుపచ్చ దారంతో కుట్టాలన్నారు. సన్న ధాన్యం, దొడ్డు ధాన్యాలను వేర్వేరు లారీల్లో నింపి రైస్ మిల్లులకు రవాణా చేయాలని సూచించారు. జిల్లాలో 130 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు, అందులో 18 సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మిగతావి దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వరి ధాన్యం సేకరణ కేంద్రాల వద్ద తాగునీరు, టెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. వరి సేకరణ కేంద్రాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, పౌరసరఫరాల అధికారులు సమన్వయంతో సమష్టిగా పనిచేసి ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో తేమ మిషన్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, అదేవిధంగా గోనె సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అన్ని నియమ నిబంధనలను పాటిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ధాన్యం సేకరణ జరగాలన్నారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీసీఎస్‌వో మోహన్‌బాబు, డీఎంసీఎస్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ అధికారి సారంగపాణి, డీసీవో నాగలింగాచారి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఐకేపీ సభ్యులున్నారు.

గవర్నర్‌ను కలిసిన సామాజిక కార్యకర్త

మన్సూరాబాద్, అక్టోబర్ 22: గిన్నీస్ వరల్డ్ రికార్డు హోల్డర్, సామాజిక కార్యకర్త డాక్టర్ పెండెం కృష్ణకుమార్ మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలు, స్వచ్ఛ భారత్, టీబీ రహిత సమాజ నిర్మాణ కోసం చేపడుతున్న కార్యక్రమాలను గవర్నర్‌కు డాక్టర్ పెండెం కృష్ణకుమార్ వివరించారు. ప్లాస్టిక్ రహిత తెలంగాణ కోసం పాఠశాలల్లో చేపడుతున్న అవగాహన సదస్సులు, జూట్ బ్యాగుల పంపిణీతో పాటు వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకుగాను నాలుగు పర్యాయాలు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించినందుకు డాక్టర్ పెండెం కృష్ణకుమార్‌ను గవర్నర్ అభినందించారు. పేద ప్రజల సంక్షేమం, సమాజ హితం కోసం చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రజల మన్ననలను పొందాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తెలిపినట్లు డాక్టర్ కృష్ణకుమార్ తెలిపారు.



చిత్తాపూర్ రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త చంద్రకాంత్, అధికారులు

అధిక సాంద్రత పత్తి సాగుపై క్షేత్ర దినోత్సవం

మంచాల, అక్టోబర్ 22 : మండల కేంద్రంలోని రైతు వేదికలో కృషి విజ్ఞాన కేంద్రం రంగారెడ్డి, డ్రైలాండ్ అగ్రికల్చర్ వారి ఆధ్వర్యంలో మంగళవారం రైతులతో క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత చంద్రకాంత్ మాట్లాడుతూ.. రైతులు అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేయడం వల్ల అనేక లాభాలున్నాయన్నారు. పత్తి కంది సాగులో యాజమాన్య పద్ధతులు, మెళకువల గురించి రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. అధిక సాంద్రతతో పత్తి, కంది పంటలు సాగుచేసుకున్న రైతుల వద్దకు వెళ్లి వారి అభిప్రాయాలను శాస్త్రవేత్తలు తెలుసుకొని వారికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏడీఏ నర్సింహారావు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారి సుజాత, ఏఈవోలు, రైతు సంఘం చైర్మన్‌లు పాల్గొన్నారు.

మంగల్‌పల్లి సీవీఆర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 22 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రెండోరోజు గ్రూప్-1 పరీక్షలు సజావుగా కొనసాగాయి. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని ఆరు పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు అధికారులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని మంగల్‌పల్లి సమీపంలోగల సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాన్ని రంగారెడ్డి కలెక్టర్ శశాంక మంగళవారం సందర్శించారు. విధులు నిర్వహిస్తున్న అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు అభ్యర్థులు పరీక్ష రాస్తున్న సరళిని పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని అక్కడి సూపరింటెండెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. డిజేబుల్ చాలెంజ్ అభ్యర్థులకు సహాయకులకు పరీక్ష రాస్తున్న విధానంపై ఆరా తీశారు. ముందుగా పరీక్షా కేంద్రంలో ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఉన్న మందులను కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత, సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆలస్యంగా రావడంతో పరీక్ష రాయలేకపోయిన ఇద్దరు అభ్యర్థులు

మొయినాబాద్ : మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా రెండోరోజు మంగళవారం 60 శాతం అభ్యర్థులు హాజరయ్యారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలో ఉన్న విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి వికారాబాద్ జిల్లా కెరెళ్లి ప్రాంతానికి చెందిన బి.వినయ్‌కుమార్(వృత్తి కానిస్టేబుల్) 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చాడు. అదేవిధంగా మండల పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలో ఉన్న జోగిన్‌పల్లి భాస్కర ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి జడ్చర్ల పరిధిలోని బడేపల్లి గ్రామానికి చెందిన టంకర నవీన్‌కుమార్ 3 నిమిషాలు ఆలస్యంగా వచ్చాడు. దీంతో వీరిద్దరిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. మధ్యాహ్నం 1.30 నిమిషాలకే పరీక్షా కేంద్రాల గేట్లు మూసి వేస్తున్నారు.

మంచాల : ఇబ్రహీంపట్నం గురునానక్ ఇంజినీరింగ్ కాలేజీ పరీక్షా కేంద్రంలో గ్రూప్-1 పరీక్ష రాసిన మహిళా(బాలింత) అభ్యర్థి బయటకు రాగా వర్షం రావడంతో తీవ్ర ఇబ్బంది పడింది. దీన్ని గమనించిన సీఐ ప్రభుత్వ వాహనంలో మరో మహిళను తోడుగా పంపించి శేరిగూడలోని ఆమె ఇంటి వద్ద దింపారు.

రెండో రోజు సజావుగా పరీక్షలు

ఇబ్రహీంపట్నం : పరీక్షా కేంద్రంలో అభ్యర్థుల పరీక్ష సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

మొయినాబాద్ : విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

రేపు జాబ్ మేళా

వికారాబాద్, అక్టోబర్ 22 : ప్రముఖ అంతర్జాతీయ సెక్యూరిటీ జీ4ఎస్ సెక్యూరిటీ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ మంగళవారం ఒక ప్రకటనతో తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, ఐటీఐ క్యాంపస్ వికారాబాద్‌లో అక్టోబర్ 24న ఉదయం 10:30 గంటలకు జాబ్ మేళాను నిర్వహించనున్నామన్నారు. జీ4ఎస్ సెక్యూరిటీ ప్రైవేట్ కంపెనీలో సుమారు 100 (సెక్యూరిటీ గార్డ్స్, ఎస్కార్ట్ గార్డ్స్ - నైట్ షిఫ్ట్ మాత్రమే) పోస్టులు ఉన్నాయని.. వీటికి అబ్బాయిలు మాత్రమే అర్హులని ఆయన తెలిపారు. ఉద్యోగాలకు పదో తరగతి ఉత్తీర్ణత, అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఉద్యోగాలు హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడ కోకాపేట డీఎస్ఎఫ్ భవనంలో 8 గంటలు, 26 పనిదినములు ఉంటాయని, నెల జీతం రూ.17వేల నుంచి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు జాబ్ మేళా నిర్వాహకుడు మియాసాబ్‌ను 9676047444 ద్వారా సంప్రదించవచ్చన్నారు.

పెండింగ్ కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలి

వికారాబాద్, అక్టోబర్ 22 : పెండింగ్ కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని, కొత్త వేతన సవరణ చేయాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్తగడి అంజిరెడ్డి తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లాలోని పాఠశాలల్లో పెండింగ్ బిల్లులకు తక్షణమే పరిష్కారం చూపాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయులు వారి వారి పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షకు సిద్ధం అవుతున్నట్టు తెలిపారు. మొదటగా పాఠశాలలో నల్ల బ్యాడ్జీలతో నిరసన, అనంతరం ఈ నెల 28న తహసీల్దార్‌లకు వినతిపత్రం సమర్పించుట, నవంబర్ 5న జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌ల వద్ద ధర్నా చేపట్టడం జరుగుతుందన్నారు. ఆలోపు ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే నవంబర్ 23న చలో ఇందిరాపార్క్‌లో ధర్మాగ్రహ దీక్ష చేస్తామని హెచ్చరించారు. డీఏ, పీఆర్‌సీ, పెండింగ్ బిల్లులు పరిష్కారమవుతాయని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే అన్ని రకాల ఆర్థిక పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యుడు వెంకటేశం, మండల కార్యదర్శి సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించండి

సీసీ రోడ్లు, తదితర పనులను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ సుధీర్



తాండూరు రూరల్ : చింతామణి పట్టణంలో వేసిన సీసీ రోడ్ల నాణ్యతతోపాటు రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

తాండూరు రూరల్, అక్టోబర్ 22 : గ్రామాల్లో పారిశుధ్య పనులపై శ్రద్ధ వహించాలని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. మంగళవారం తాండూరు మండలంలోని చింతామణి పట్టణంలో వేసిన సీసీ రోడ్లతోపాటు పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో శానిటేషన్‌పై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ భవనంలోని పనులు అసంపూర్తిగా ఉండడంపై ఆరా తీశారు. మరుగుదొడ్లు, ఫ్లోరింగ్ పనులను పరిశీలించారు. ఈ పనులకు ప్రతిపాదనలు పంపాలని పంచాయతీరాజ్‌శాఖ అధికారులనాదేశించారు. గ్రామంలో మాధవరెడ్డి ఇంటి నుంచి కుర్వ నర్సప్ప ఇంటి వరకు వేసిన సీసీ రోడ్డును, రామప్ప నుంచి ఊరడమ్మ ఆలయం వరకు వేసిన సీసీ రోడ్డును పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో విశ్వప్రసాద్, డీఈఈ నాగభూషణం, ఏఈ నందినీరెడ్డి, ఎంపీఈవో ఆనంద్‌రావు, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి కరుణాకర్ రెడ్డి, నాయకుడు ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

పనుల పరిశీలన

బషీరాబాద్ : మండలంలోని పర్వత్‌పల్లి, దామర్‌చేడ్, కొత్తాపూర్, ఎక్మాయి తదితర గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను., అంగన్‌వాడీ, పాఠశాలలను అడిషనల్ కలెక్టర్ సుధీర్ పరిశీలించారు. సీసీ రోడ్ల నిర్మాణం, బోరుబావులు తవ్వించారా అని ఆరా తీశారు. సీసీ రోడ్ల నాణ్యత, పూర్తిస్థాయి నిర్మాణం జరిగిందా లేదా అనేది స్వయంగా తనిఖీ చేశారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. పూర్తికాని పనులను పూర్తి చేయాలన్నారు. పర్వత్‌పల్లి గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ వద్ద పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్య విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ విజయ్‌కుమారి, జూనియర్ అసిస్టెంట్ ఖాన్, పలు శాఖల అధికారులున్నారు.

కేబుల్ కనెక్షన్ల పేరుతో రోడ్లన్నీ ధ్వంసం

దామర్లపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డులో కేబుల్ కనెక్షన్ కోసం జేసీబీతో తవ్విన గుంత

షాబాద్, అక్టోబర్ 22 : వివిధ రకాల కేబుల్ కనెక్షన్‌లు, పైపులైన్ల పేరుతో గ్రామీణ ప్రాంతాల రోడ్లన్నీ ధ్వంసం చేస్తున్నారు. షాబాద్ మండలం దామర్లపల్లి, బోడంపహాడ్, అప్పారెడ్డిగూడ తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డులో కేబుల్ కనెక్షన్‌లు, పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ జేసీబీలతో రోడ్లన్ని తవ్వి ధ్వంసం చేస్తున్నారు. దీంతో ఉన్న కొద్దిపాటి రోడ్డులో ఓ వైపు గుంతలు తీస్తున్నారు. దామర్లపల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డుపై మూడు రోజుల క్రితం గుంతలు తీసి వదిలేయడంతో వాహనదారులు, పాఠశాల బస్సులు కూడా ఇరుకు రోడ్డులో వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొత్త కనెక్షన్‌ల పేరుతో ఉన్న రోడ్లను ధ్వంసం చేయడం సరికాదని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుడు కర్రె శ్రీశైలం డిమాండ్ చేశారు.

గ్రంథాలయాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తాం

గ్రంథాలయ సంస్థ వికారాబాద్ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 22 : జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కృషి చేస్తామని గ్రంథాలయ సంస్థ వికారాబాద్ జిల్లా నూతన చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా గ్రంథాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండడంతో ఆదాయం తగ్గిందన్నారు. గ్రంథాలయంలో పాఠకులకు అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచడానికి కృషి చేస్తామని చెప్పారు. కొత్తగా ఏర్పడిన మండలాలు చౌడాపూర్, దుద్యాలలో గ్రంథాలయాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. మోమిన్‌పేట్ గ్రంథాలయం మరమ్మతులు చేయడానికి రూ.15లక్షలు, బొంరాస్‌పేటలో నూతన భవన నిర్మాణానికి రూ.16లక్షలు, దౌల్తాబాద్ గ్రంథాలయంలో అదనపు మరమ్మతులు చేయడానికి సుమారు రూ.5 లక్షలతో పనులు పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా గ్రంథాలయాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిల సహకారం తీసుకుంటామని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి సురేశ్‌బాబు ఉన్నారు.

ఎట్టకేలకు అందుబాటులోకి ఓటీఎస్..!!

- జీవో జారీయైన 17 రోజుల తర్వాత అమల్లోకి..
- అసలు మొత్తం చెల్లిస్తే ఆలస్యరుసుం, వడ్డీపై రాయితీ
- సులువుగా బిల్లు చెల్లించేందుకు జల మండలి ఏర్పాట్లు
- బిల్లు చెల్లింపునకు ఈ నెల 31 ఆఖరి తేదీ
- ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి : జలమండలి ఎండీ

సిటీబ్యూరో, అక్టోబర్ 22(నమస్తే తెలంగాణ): వన్ టైం సెటిల్‌మెంట్ పథకం (ఓటీఎస్) ఎట్టకేలకు అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వం జీవో ఇచ్చిన 17 రోజుల తర్వాత మంగళవారం నుంచి వినియోగదారుల ఫోన్ నంబర్లకు ఎస్ఎంఎస్‌లను చేర్చారు. పెండింగ్ బిల్లులను చెల్లించి ఆలస్య రుసుముతో పాటు వడ్డీపై రాయితీ పొందాలని జల మండలి ఎండీ అశోక్ రెడ్డి ఈ సందర్భంగా బకాయిదారులకు విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలికంగా బిల్లులు చెల్లించని వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ పథకం ఈ నెల 31వ తేదీ వరకు అమల్లో ఉంటుందని తెలిపారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నల్లా బిల్లుల్ని చెల్లించి, నగర ప్రజలకు తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ సేవలందిస్తున్న జల మండలికి సహకరించాలని కోరారు.

సందేహాలుంటే 155313కి కాల్ చేయొచ్చు.

జల మండలి పరిధిలో 13.50 లక్షల నల్లా కనెక్షన్లు ఉండగా.., ఈ వన్‌టైం సెటిల్‌మెంట్ పథకంతో 7 లక్షలకు పైగా వినియోగదారులకు లబ్ధి చేకూరనుంది. వీరి వద్ద నుంచి అసలు మొత్తం దాదాపు రూ.1706 కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. కాగా, రూ.1189 కోట్ల బకాయిలు మాఫీ అవుతాయి. జల మండలి వినియోగదారుల క్యాన్ నంబర్‌కు అనుసంధానమై ఉన్న మొబైల్ నంబర్‌కు బకాయి మొత్తం, ఎంత చెల్లించాలి? ఎంత మాఫీ అవుతుంది? తదితర వివరాలను ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందుతున్నది. సామాజిక మాధ్యమాలైన ట్విట్టర్, ఫేస్‌బుక్, ఎలక్ట్రానిక్ మీడియా, ఎఫ్ఎం రేడియో, పోస్టర్లు, కరపత్రాల ద్వారా ఓటీఎస్ -2024 పథకంపై అవగాహన కల్పిస్తోంది. ఓటీఎస్ పథకంపై ఏవైనా సందేహాలుంటే జల మండలి కస్టమర్ కేర్ నం. 155313కు ఫోన్ చేసి వాటిని నివృత్తి చేసుకోవచ్చు.

చెల్లింపు విధానం..

- జల మండలి కార్యాలయాల్లోని క్యాష్ కౌంటర్ల వద్దకు నేరుగా వెళ్లి బిల్లు చెల్లించవచ్చు.
- ఆన్‌లైన్ విధానంలో ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్స్ ద్వారా చెల్లించవచ్చు
- ఎన్ఈఎఫ్‌టీ, ఆర్‌టీజీఎస్, బీపీపీఎస్ ద్వారా చెల్లించే అవకాశం కూడా ఉంది.
- జల మండలి అధికారిక వెబ్‌సైట్ www.hyderbadwater.gov.inకు లాగిన్ అయి చెల్లింపులు చేయొచ్చు.
- లైన్‌మన్లు మీ గృహాల్ని సందర్శించినప్పుడు వారి దగ్గర ఉండే ఈపీఓఎస్ యంత్రం ద్వారా కూడా బిల్లు చెల్లించవచ్చు.
- మీ సేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా సైతం బిల్లు చెల్లించే అవకాశాన్ని కల్పించారు.
- https://erp.hyderabadwater.gov.in/HmwssbOnlineNew/#/HmwssbOTSDetails ఇక్కడ పేర్కొన్న లింకును క్లిక్ చేయడం ద్వారా నేరుగా బిల్లు చెల్లించవచ్చు.
- జల మండలి అందించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సులభంగా బకాయి మొత్తం చెల్లించవచ్చు.



గ్రామాన్ని మున్సిపల్‌లో కలుపవద్దని తీర్మానిస్తున్న నస్కల్ గ్రామస్తులు

నస్కల్‌ను మున్సిపల్‌లో కలుపవద్దని ఏకగ్రీవ తీర్మానం

దోమ/పరిగి, అక్టోబర్ 22 : పరిగి మండల పరిధిలోని నస్కల్ గ్రామాన్ని పరిగి మున్సిపల్‌లో కలుపవద్దని నస్కల్ గ్రామస్తులు గ్రామంలో అన్ని పార్టీల నాయకులు, గ్రామ ప్రజలతో మంగళవారం గ్రామ సభను ఏర్పాటు చేసి గ్రామపంచాయితీగానే కొనసాగించాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆ కాపీని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామాన్ని మున్సిపల్ పరిధిలో కలుపడం వల్ల పేద ప్రజలు ట్యాక్స్‌లను భరించలేరని, ఉపాధి హామీ పథకం రద్దయి గ్రామ ప్రజలు ఉపాధిని కోల్పోయి మరింత పేదరికంలోకి వెళ్లే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు రాజేందర్ పాల్గొన్నారు.

సైబర్ టెక్నాలజీ కోర్సులకు డిమాండ్

బంజారాహిల్స్,అక్టోబర్ 22 : సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో భారత్‌లో సైబర్ సెక్యూరిటీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సంబంధిత కోర్సులకు రానున్న రోజుల్లో డిమాండ్ పెరుగనున్నదని బీపీపీ యూనివర్సిటీ ఆఫ్ లండన్ డీన్ సారా మెక్రోలా అన్నారు. ప్రతిష్టాత్మక బీపీపీ యూనివర్సిటీ ఆఫ్ లండన్‌లో సరికొత్త ఎమ్మెస్సీ టెక్నాలజీ కోర్సును మంగళవారం బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చర్చావేదికలో ప్రస్తుతం డిమాండ్‌లో ఉన్న కోర్సులు, బీపీపీ యూనివర్సిటీ, సావరియా ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో అందిస్తున్న ఇంటర్నేషనల్ కెరీర్ గ్యారెంటీ ప్రోగ్రాం వివరాలను చర్చించారు. ప్రతియేటా హైదరాబాద్ నుంచి తమ యూనివర్సిటీలో 2వేల మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో చేరుతున్నారన్నారు. ఎమ్మెస్సీలో డేటా సెక్యూరిటీ, టెక్నాలజీ మేనేజ్‌మెంట్ కోర్సులకు భారీ డిమాండ్ ఉందన్నారు. 30వేల పౌండ్స్‌తో ఈ కోర్సులలో చేరవచ్చనన్నారు. కార్యక్రమంలో సావరియా ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధి రాజేశ్ గోయల్, మోహిత్ గబ్బర్, కపిల్, ప్రదీప్, జగదీశ్ లాథూర్ పాల్గొన్నారు.

మైనర్‌పై లైంగికదాడి

సవతి తండ్రికి జీవిత ఖైదు

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 22 : మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన సవతి తండ్రికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి కథనం ప్రకారం.. తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక తల్లి గతంలో చనిపోయింది. సవతి తండ్రి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లిలో అద్దెకు ఉంటున్న ఇంటికి గత ఏడాది అక్టోబర్‌లో దసరా సెలవుల్లో తీసుకెళ్లి పలుమార్లు బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడని ప్రభుత్వ ఉద్యోగితో కలిసి బాలిక ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పట్లోనే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు సాక్ష్యాలు సేకరించి నిందితుడిని అరెస్టు చేశారు. కస్టడీకి తర